# బతకనీయండి

*** ***

రచన :
మహీపతి

[నీకు కొడుకుపుట్టినప్పుడు, చూట్టానికి నీవుమాత్రం తొందరపడలేదూ? రాత్రిరాత్రే వెళ్ళావేమిటి అత్తోరూరికి? నీకున్నట్లే మాకుమాత్రం గుండె కాయలూ, మనసులూ లేవనుకున్నావా?''—ఇది మానవ హృదయాలలో జీర్ణించినబాధ అవసరానికి బైటపడదు. మనసుమాత్రం ఇలా ఆరాటపడుతుంది]

ఆవేళ నాగన్న హృదయం పొంగిపోతోంది. తనలో తానే యేవేవో అనుకొని లోలోనే నవ్వుకుంటున్నాడు. ఆనందాన్ని ఉండబట్టలేక యేవేవో కొత్త కొత్త కబుర్లూ కథలూ వోలకబోస్తున్నాడు. బోయ అంజనేయులు వోపికతో వింటున్నాడు. మామూలుకన్నా నాగన్న ఎద్దులు యెక్కువ వడిగా పోతున్నవి. అప్పుడప్పుడు అంజని అంటూనేవున్నాడు 'నావి అసలే చిక్కిపోయిన ఎడ్లు. నీ ఎద్దుల్నిలాగ పరుగెత్తించుకొనిపోతూంటె నేనెలా నీతోపాటు వచ్చేది. కొంచెం నిదానంగా తోలు' అని. ఆ మాటలుకూడా నాగన్న వినిపించుకోవటంలేదు. ఏదో తన యిష్టంవచ్చినట్లుగా తోలేస్తున్నాడు. ఆ వేళ బారెడు పొద్దెక్కేటప్పటికే మామూలుకన్నా రెండింతలు ఎక్కువ పొలం దున్నేశారు.

అంజని, నాగన్న—ఇద్దరూ లోకంపోకడ ప్రకారం వేరేవేరే కులాలకి చెందినవారయినా ఆ యిద్దరిలో ఎంతమాత్రమూ కులాలకి అంటిపెట్టుకోనున్న హెచ్చుతగ్గులు లేనేలేవు. వారిద్దర్ని ఒకచోట చూచినవారూ వారి అన్యోన్యానురాగం తెలిసికొన్నవారూ ఎవరూ వారు వేరేవేరే కులాలకి చెందినవారని అనుకోరు. ఆ వూళ్ళోమట్టుకు అంజని బోయాడని నాగన్న మాలాడని అంటారు. వీరిద్దరికీ ఆ పొత్తు ఎల్లా కుదిరిందోనని ఆ వూళ్ళోవాళ్ళే ముక్కుమీద వేలేసుకొని ఆశ్చర్యపడుతుంటారు. ఇద్దరూ బీదవారవడంవల్ల సోమిరెడ్డింట్లో జీతము నిలిచారు. వారిద్దరూ ఎకసెక్కాలాడుకుంటూ ఎంతపనైనా సులువుగా చిటికెలో చేసేస్తారు.

అంజని ఎంత చెప్పినా నాగన్న వడిగానే తోలుతున్నాడు ఎద్దుల్ని. 'ఏరోయ్! నాగా! ఏం సంగతేంటి? అంత ఖుషీగావున్నావు. ఎప్పుడూ యెనకపడే నీ యెడ్లు మరీ చలాకీగా పోతున్నాయి' అన్నాడు అంజని.

'ఆ!...ఏముంది...' నాగన్న ఇకిలించాడు. అంజని ఎడ్లని అదిలించాడు.

'మరీ...మరిచిపొయ్యిసాను.. నీ పెండ్లానికిప్పుడెన్నెల్లురా?' అనడిగాడు అంజని.

'ఏదో తొమ్మిది' నెల్లంటూ......ఈపొద్దో రేపో...' సిగ్గుపడుతూ జవాబిచ్చాడు నాగన్న.

'అయితే రేపో మాపో నీవొక బిడ్డకి అయ్యవౌతావన్నమాట' అంజని వాక్కు.

అయ్య, అప్ప, తండ్రి నాన్న...అన్నీ ఒకదానివెనుక ఒకటి మనస్సుకితట్టి నాగన్నని కదిలించివేసినై. లోలోనే వుబ్బిపొయ్యాడు నాగన్న. హృదయంలో సంతోషం పరవళ్లుతొక్కింది. ఆనందం గట్లు తెంచుకోడానికి ప్రయత్నిస్తోంది. ఒక్కసారిగా చాటంత ముఖంచేసికొని నవ్వాడు. దూరాన మేరలో తంగేడుచెట్లు గాలికివూగి కిలకిలమన్నయి. నాగన్న ఎడ్లు వుత్సాహంతో వడిగా ముందుకు సాగినై. ఎద్దుల మెడలో మువ్వలు, గంటలు జోరుగామోగినై.

నాగన్న నాగలి భూమిని పరామర్శిస్తూ బాగా లోతుకు దిగుతూ నాట్యంచేస్తూ నడుస్తోంది...

నాగన్న కళ్ళూ, మనసూ వూరిమీద, వూరి దారిమీద వున్నాయి. బువ్వపొద్దయింది. నాగన్న చిన్న చెల్లెలు సద్దితీసికొని వస్తోంది. 'ఏమోయ్! లచ్మివస్తోంది నీకు కొడుకు పుట్టినాడని చెప్తుందిలే' అన్నాడు అంజని.

లచ్చిరావడం ముందుచూచింది నాగన్నే. కాని లచ్మివస్తోందని ముందు చెప్పింది అంజని. మునుపు నాగన్న అంజని ఎన్నెన్ని రహస్యాలు, ఎన్నెన్ని శృంగార విషయాలు యెంత చనువుగా మాట్లాడుకొనేవారని! ఇప్పుడెందుకో నాగన్నకి సిగ్గేస్తోంది. ఏదీ ముందు పలుకలేక, చెప్పలేకపోతున్నాడు.

లచ్మి ఆ రెండు చేన్లకి మధ్యనివున్న బండి జాడలోనే నడుస్తూంది. నాగన్నకు దగ్గర దగ్గరగా వస్తోంది, తన అన్నని చెయ్యెత్తి పిలుస్తోంది...... నాగన్న హృదయం గంతులేస్తుంది. తాను తండ్రి అవబోతున్నాడు. కాదు అయినాడు. కొడుకుపుట్టితే ఏమి పేరు పెట్టాలి! ఏమేమి చేయించాలి! అప్పుడే యెడతెగని ఆలోచనలు లచ్చి వస్తూ వస్తూనే 'అన్నాయ్! మరీ...మరీ పాపోడు...మరీ...వదిన పాపోన్ని కనింది...' లచ్మి బోసినవ్వు నవ్వింది. లేత బుగ్గలు లొట్టలుపడినై.

నాగన్న చెల్లిని యెత్తుకొని ముద్దులాడినాడు. అంజని లచ్మి బుగ్గలు నొక్కుతూ పిల్లాడినిగురించిన యేవేవో ప్రశ్నలు వేస్తున్నాడు. నాగన్న హృదయం మాత్రం నిండుగావున్నది. నిండుకుండ తొణకదు. మనసు యేవేవో తలపోస్తుంది. హృదయం చోటివ్వడంలేదు.

తొందరలో సద్ది విప్పి ఆదరాబాదరా రెండు ముద్దలు నోట్లోపెట్టుకున్నాడు. తెచ్చిన సద్ది అంతా అట్లేవుండిపోయింది. అంజనికూడా తొందరలోనే బువ్వతినడం ముగించాడు.

'లచ్మీ! మనమందరం కలిసేపోదాం ఇంటికి. మేమొచ్చేదంకా యిక్కడే కూచో' అని చెప్పి ఆ తుమ్మచెట్టుక్రింద కూచోబెట్టాడు చెల్లెల్ని నాగన్న.

కొడుకులోని తన రక్తం లాగుతోంది నాగన్నని ఇంటికి. 'అప్పుడో యిప్పుడో వెళ్ళాలి; కొడుకును చూడాలి సంతోషపడాలి' అనుకుంటోంది నాగన్న మనసు. తొందర తొందరలోనే ఒక కొంద్ర దున్నేసారు.

'ఏమోయ్! అంజని ఈ పొద్దు యిప్పటికే మామూలుకంటే చాలా దున్నేసినాము. ఇంక యింటికి వెళ్దాము' అన్నాడు నాగన్న.

'ఇంకా పొద్దు నెత్తిమీదకన్నా రాలేదు ఈయాలకేపోతే, రెడ్డేమంటాడు! అసలే వాడు కోపదారి ముండాకొడుకు వూరకే తిట్టుతూ కూచుంటాడు. ఇంకో కొంద్ర దున్ని పోదాంలే' అన్నాడు అంజని.

నాగన్న హృదయం నిలవడంలేదు. ఏమన్నాగాని యీపొద్దు చానా దున్నాము. పోవలసిందే...' అన్నాడు నాగన్న.

* * *

అంజని నిజమైన జ్యోతిషమే చెపుతాడు. సోమిరెడ్డి పెట్టిన చీవాట్లకి నాగన్నకి పట్టరానికోపమొచ్చింది. కడకు 'నీకు కొడుకుపుట్టినప్పుడు చూట్టానికి నీవుమాత్రం తొందరపడలేదూ? రాత్రి రాత్రే వెళ్ళావే మీఅత్తోరూరికి? నీకున్నట్టే మాకుమాత్రం గుండెకాయలూ, మనసులూ లేవనుకున్నావా?' అని అడిగేద్దామనుకున్నాడు కూడాను. కాని అవసరం కలుగకనో ధైర్యంచాలకనో మానేశాడు.

వచ్చీరావడంతోనే గుడిసెలోకిపోయి తన కొడుకుని చూచుకొన్నాడు నాగన్న. పెళ్ళాం చిరునవ్వు నవ్వింది. అక్కడేవున్న ముసలమ్మ 'రెండూ అచ్చుమ నీవేరా. ఎంత పుట్టబడిగ పుట్టినాడు నీ కొడుకు...ఆ ముక్కు, ఆ కండ్లు...' అని వర్ణించి వేసింది. నాగన్న కండ్లలో మెరుపులు మెరిసినై.

వెలుతురు దివ్వెలవెనక వానమబ్బులుండేది అతనికేం తెలుసు పాపం! అనుభవంలేని మనిషి.

ఇప్పుడు నాగన్న పూర్వపు నాగడుమాత్రం కాదు. ఆత్మగౌరవం తనలో అంకురించింది. కొంచెం స్వేచ్ఛగా తిరగడం మొదలెట్టాడు. తన్నితరులేమన్నా నీచంగా అంటే సహించలేడు. ఈ మార్పు తన కొడుకు పుట్టడంవల్ల వచ్చిందో, ఆ వూళ్ళో శంకరప్ప 'మనుషులంతా వొకటే' అని చెప్పిన వుపన్యాసాలవల్ల వచ్చిందో గట్టిగా చెప్పడం కష్టం. తన కుమారుని గురించిన యెన్ని విషయాలు తన తలలో పరిభ్రమిస్తున్నాయి! నాగన్న తన నేస్తగాళ్లందరితోను తన కొడుకునుగురించి యెక్కువగా ప్రస్తావించేవాడు. తన కొడుకుకి యేయేచదువు చెప్పించ దలచుకొన్నదీ, యేయేవిధంగా తయారుచేయదలచుకొన్నదీ అందరితోనూ చెప్పేసేవాడు,

సోమిరెడ్డికి నాగన్న పరివర్తనమూ అతని వుద్దేశాలు కంటకంగా కనపడ్డయి. అంజని, నాగన్న యింకా సోమిరెడ్డింట్లోనే సంబళం చేస్తున్నారు.

నాగన్న పరిస్థితుల్ని బాగా అర్థంచేసికొనే వాడయినాడు. అందువలన అప్పుడప్పుడు సోమిరెడ్డికి వ్యతిరేకమైనా న్యాయంగా మాట్లాడేవాడు. 'ఆఁ! నాక్రిందవున్న నాగడు నన్ను వ్యతిరేకించేవాడైనాడా?' అనే ధీమా, గర్వం సోమిరెడ్డికి చాలా వుండేది. అందువలన చీటికిమాటికి తిట్టటం, కొట్టడం మొదలెట్టాడు రెడ్డి. 'నాగనికి మంచి శాస్తి చేసి యింకెవ్వరూ యిట్లాకాకుండా చేయాలరా అని కూడా అప్పుడప్పు డంటూండేవాడు శ్రీ సోమిరెడ్డిగారు.

* * *

ఆ ఊరికి కరువు మామూలే. ఊళ్ళో కూలీలంతా పరదేశాలకి వెళ్ళడమూ మామూలే ఆ సంవత్సరం కూడా రెడ్లు అండయివ్వలేదు. కూలీలు కడుపులు చేతపట్టుకొని పొరుగూళ్ళకు ప్రయాణాలు సాగించారు. నాగన్న చేయవలసిన సంబళం విడిచి యెక్కడికీ వెళ్ళకూడదని రెడ్డియాజ్ఞ. నాగన్న భార్య ఆ యింట్లోనా ఈ యింట్లోనా పనిచేసి తన కాలం గడుపుకొంటూ కొడుకుని పెంచుకొంటోంది అప్పుడు ఆ గూడెంలో నాగన్న యిల్లుతప్ప దీపం వెలిగే యిల్లు లేనేలేదు. అప్పటికి సీనుకు (కొడుక్కి నాగన్న పెట్టుకొన్న ముద్దుపేరు) అయిదేండ్లుంటాయి.

రానురాను నాగన్నపైన రెడ్డికి కోపం ఎక్కువయింది. పనివుండో పనిలేకో ఒక రాత్రి "బళ్ళారికి వెళ్ళిరావాలిరా నాగా నీవైతేనే దానికి తగినవాడవు" అని ప్రోత్సహించి, బలవంతపెట్టి పంపించాడు. వాళ్ళూరు బళ్ళారికి ఆమడదూరంవుంటుంది.

(తరువాయి 19 వ పేజీలో)

మదనకామేశ్వర లేహ్యము




బలవర్థకమయినది. మేహము నిర్కాక, నిస్సత్తువ, శుక్లనష్టము, అతిమూత్రము, మొదలగు వాటిని హరించి, మిక్కిలి బలమును, వీర్యవృద్ధిని, భోగశక్తిని కలిగించుటలో అప్రతిహతమయినది.

2 డబ్బీలు చాలును.

20 తులముల డబ్బీ రు. 2-0-0

రోజాపుష్ప లేహ్యము

మధురమయినది. మలబద్ధకమును ఖండించుటలో అమోఘమైనది. అజీర్ణము, గర్భవాయువు, మూలవ్యాధి, మొదలగు వాటిని హరించి కొలవిరేచనమును చక్కగా కలిగించును.

15 తు॥ డబ్బీ రు. 1-0-0 వి. పి. చార్జి ప్రత్యేకము.

అన్ని ఔషధముల క్యాట్లాగు ఉచితం.

పి. సి. ఎ. అండు కంపెనీ,

ఆయుర్వేదసమాజం-పెరిదేపి, నెల్లూరుజిల్లా.

నాగన్నని ఆ అర్ధరాత్రి యేమిపనిమీద పంపించాడో యెవ్వరికీ తెలియదు. బళ్ళారికి పంపించి యిప్పటికి నెల దాటిపోయింది. ఇంతవరకూ నాగన్నజాడ అంతూ పొంతూ లేదు.

నాగన్న బళ్ళారికి పొయ్యేటప్పటికి అతని భార్య గంగమ్మ నిండు గర్భిణి. ఆపత్కోడుకొరకు మగసహాయం నిమిత్తం ఆమె యెంత తహతహపడిందని! దినములు నిండినై. ఊళ్ళోవాళ్ళు—పలకరించరు. గూడెంలోనా—యెవరూ లేరు. పురిటినీళ్లు పోసేవారులేక ఆమె ఆ గుడిసెలోనే కదలకుండా మెదలకుండా పడిపోయివుంది.

ఆమర్నాడు ఆ గూడెంవాళ్ళు తిరిగివచ్చేటప్పటికి బతికి నిలిచినవాళ్ళలో మొఖంమీద రక్తపు చుక్కలేని బిక్కపోయిన ఆ సీను ఒక్కడే ఒక్కడు. గూడెంలో గోల తగ్గుతూ వుండేటప్పటికి వూళ్ళో సోమిరెడ్డి యింటిముందర గలాభా యెక్కువైంది. అంజని సోమిరెడ్డి యింటినుండి ఆరాత్రే పరారయినాడు. సోమిరెడ్డి శవమూ గంగమ్మ తనువూ రెండూ వొకటేసారి ఉత్తరానికి తరలివెళ్ళినై.

ఇంకా సీనుమాత్రం బదికేవున్నాడు. అతను చేయవలసిన పనులు ఎన్నున్నయ్యో? ఇప్పటికీ సీను ఆ గుడిసెముందరి అరుగుమీదనే కూచొనివుంటాడు. వాళ్ళూ వీళ్ళూ తెచ్చిపోసిన గంజినీళ్ళు తాగతాడు. తిరిగి ఆ కట్టమీదే కూచుంటాడు. తోడిపిల్లలతో యెవరితోనూ ఆటలాడుకోడానికి పోడు. ఎప్పుడూ దెబ్బతిన్న పెద్దమనిషిలాగా విచారిస్తుంటాడు; ఎవేవో ఆలోచిస్తున్నట్లు కనపడతాడు. నిరంతరం ఆలోచిస్తూ కూర్చోవలసిన వయసేనా యిది? మరి సీనుకు అవునేమో? ఎవరేనా 'ఒరేసీనూ! మీనాన్న యేడిరా' అని అడిగితే నోరుతెరచి శూన్యంలోనికి అదే పనిగా దిగాలుపడి చూస్తాడు. ఉన్నట్లుండి ప్రక్కలోనున్న కర్రను తీసికొని బిరాన నిలబడి దీర్ఘంగా చూచి సీను అంటాడు "బతకనీయండి...వాళ్ళపని చూస్తాను..."



# శృంగారదేవత

యగు మదనుండు వసంతఋతువు గడచిన వెనుక యువతీ జనుల తలవెండ్రుకలలో చిరస్థాయి యగునని మహాకవి కాళిదాసు పలికెను. దేవతలను సైతము ముగ్ధులనుచేసి యాకర్షించు నా కేశసంపదను కేశవర్ధిని నుపయోగించి సర్వకాలములయందు మనోజ్ఞముగ వృద్ధిచేసికొనరాదా !

కేశవర్ధిని మీ కుంతలములకు ప్రకాశమును, ప్రకాశమునకు తగిన అందము, అందమునకు తగిన యౌవనము నిచ్చును. విశేషించి బాల్యమునుండియే కురుళ్ళను గట్టిపరచి రాలనీయక కాపాడును. కేశవర్ధిని తులలేని చక్కని వెన్నెరులను ఆనెరికురులు మీకద్వితీయ సౌందర్యము నిచ్చును.

# కేశవర్ధిని

నేడే మీకురులకు| కేశవర్ధిని వాడుడు
మీ తలవెండ్రుకలను అందముగా పెంచి!
బలపరచును.

కేశవర్ధిని అ. 12. కేశవర్ధిని సాంపు అ. 12
పోస్టేజి ప్యాకింగు వేరు.

వర్తకులందరియొద్ద దొరకును లేక

## సౌత్ యిండియా కెమికల్స్

ఆర్. ఎస్. పురం, కోయంబత్తూర్.